సాక్షి
జోగులాంబ గద్వాల
ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



నేడు 'తుది' పరీక్ష

మహబూబ్‌నగర్‌లో ఆదివారం జరిగే కానిస్టేబుల్ తుదిరాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

వివరాలు 6లో ▸



పనుల అడ్డగింత

గట్టు మండలంలో చేపట్టిన చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులను నిర్వాసితులు అడ్డుకున్నారు.

వివరాలు 6లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.1 /24.2

గాలిలో తేమ శాతం అధికంగా ఉండడంతో చల్లగా ఉంటుంది. రోజంతా ఆకాశం మేఘావృతమై వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆశాలు విస్తృతంగా సేవలందించాలి

గద్వాల క్రైం: ఆశా కార్యకర్తలు విస్తృతంగా తమ సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సిద్దప్ప అన్నారు. శనివారం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో వారితో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజల ఆరోగ్య విషయాలపై ఎప్పటికప్పుడు తెలుసుకుని నివేదికలను వైద్యాధికారులకు అందించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. మహిళా సమస్యలపై వారితో మాట్లాడి వైద్యుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

గద్వాల అర్బన్: ఉద్యోగ హక్కు చట్టం రూపొందించి రాజ్యాంగ బద్ధత కల్పించాలనే అంశంపై ఆదివారం ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు.

వేరుశనగ క్వింటా రూ.6,379

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు శనివారం 427 క్వింటాళ్ల వేరుశనగ రాగ, క్వింటాకు గరిష్టం రూ.6,379, కనిష్టం రూ.3,319, సరాసరి రూ.5,009 ధరలు లభించాయి. అలాగే, 156 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ.5481, కనిష్టం రూ.4009, సరాసరి రూ.5361 ధర పలికింది. 12 క్వింటాళ్ల మొక్కజొన్న రాగా, గరిష్టం, కనిష్టం, సరాసరి రూ.1206 ధర వచ్చింది. 2,073 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.2081, కనిష్టం రూ.1519, సరాసరి రూ.2019 ధరలు వచ్చాయి. 23 క్వింటాళవరి (హంస)కు గాను గరిష్టం రూ.1414, కనిష్టం రూ.1409, సరాసరిగా రూ. 1414, అలాగే 4 క్వింటాళ్ళ కందికి గరిష్టం, కనిష్టం, సరాసరిగా రూ.7506 ధరలు లభించాయి.

నూతన కార్మికులకు ఊరట



చేనేత మగ్గాలు, అనుబంధ కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న అధికారులు

- చేనేత, అనుబంధ కార్మికుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం
- ఇప్పటివరకు 2,851 మగ్గాలు..
- 4,485 మంది కార్మికులు వివరాలు నమోదు
- నిజమైన చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా సర్వే..

రాజోళి: క్షేత్ర స్థాయిలో చేనేత కార్మికుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చేనేత జౌళి శాఖ అధికారులు చేపట్టిన సర్వేతో నూతన కార్మికులకు కూడా మరింత ఊరట కలగనుంది. గత నెలలో ప్రారంభమైన సర్వేతో అప్పటివరకు జియోట్యాగింగ్‌లో ఉన్న వివరాలను నమోదు చేయగా, తాజాగా నూతనంగా ట్యాగ్‌లో చేర్చబడిన మగ్గాలు, అనుబంధ కార్మికులు పూర్తి స్థాయిలో చేర్చుతుండటంతో గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలోని కార్మికుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయబడుతున్నాయి. గత నెల వరకు నూతన కార్మికులకు, మగ్గాలకు ఆన్‌లైన్‌లో చోటు ఉంటుందా లేదా అని ఆందోళన చెందిన వారికి చేనేత, జౌళి శాఖ అధికారులు చేస్తున్న ఇంటింటి సర్వే, గడువు పెంపుతో ఊరట కలిగింది.

70 మంది కోఆర్డినేటర్స్‌తో..

జిల్లా పరిధిలో 70 మంది కో ఆర్డినేటర్స్‌తో ఈ సర్వే చేస్తున్నారు. వారిపై ముగ్గురు అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. గత నెలలో చేసిన సర్వేతో పాటు తాజాగా అధికారులకు వచ్చిన ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో కార్మికులు, మగ్గాల, అనుబంధ కార్మికుల వివరాలు సేకరించి, వారి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచేవరకు ప్రత్యేక గడువుగా వచ్చే నెల 4 వతేదీ వరకు నిర్ణయించడంతో అధికారులు గ్రామ స్థాయి నుంచి గణన చేపట్టారు. ఇప్పటికీ ఆన్‌లైన్‌లో చేర్చిన వివరాలు.. 2851 చేనేత మగ్గాలను,4485 మంది అనుబంధ కార్మికులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

గడువు పెంచడం సంతోషం



గత నెలలో ప్రారంభమైన సర్వేలో కొందరని మాత్రమే చేరుస్తారని చేనేత కార్మికులు అనుకున్నారు. కానీ అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే చేయడం శుభపరిణామం. సర్వే చేపట్టిన నాటి నుంచి పరిమిత రోజుల్లోనే ముగుస్తుందని అనుకున్నాం. తాజాగా అందరి మగ్గాలు, అనుబంధ కార్మికులకు, కుటుంబ సభ్యులకు ఊరట కలిగించేలా గడువు పెంచడం చాలా సంతోషంగా ఉంది. ఎవరైనా తెలియని వారుంటే తమ వివరాలు అధికారులకు అందించే అవకాశం ఉంది.

– హనీఫ్, చేనేత కార్మికుడు, రాజోళి

నిజమైన కార్మికులకు న్యాయం



ప్రతి ఒక్కరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల కార్మికులకు న్యాయం జరుగుతుంది. మగ్గం నేసే వారి వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటే పథకాల అమలు కూడా పకడ్బందీగా ఉంటుంది. దీంతో నిజమైన కార్మికులకే లబ్ధి చేకూరుతుంది. ఈ ప్రక్రియ చేనేత కార్మికులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఇబ్రహీం,చేనేత కార్మికుడు, రాజోళి

ప్రతి చేనేత కార్మికుడిని చేరుస్తాం



చేనేత వృత్తితో జీవనం సాగిస్తున్న ప్రతి కార్మికుడిని, వారి కుటుంబ సభ్యుల్లో మగ్గానికి తోడుగా ఉన్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. గత నెలలో చేసిన సర్వే వివరాలు, నూతనంగా ఉన్న మగ్గాలు, కార్మికుల కుటుంబ సభ్యులు, అనుబంధ కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేస్తున్నాం. మే నెల 4వ తేదీ వరకు గడవు ఉన్నందున ఎవరైనా కార్మికులు వారి వివరాలను పొందుపరిచేందుకు కోనార్డినేటర్స్‌ను సంప్రదించాలి.

– గోవిందయ్య, ఏడీ, చేనేత, జౌళి శాఖ

దళారుల ప్రమేయానికి చెక్

గతంలో ప్రభుత్వం కార్మికుల కోసం కొన్ని పథకాలను ప్రవేశపెట్టినప్పటికీ అందులో నిజమైన కార్మికులకు లబ్ధి చేకూరలేదని, దళారులకు మేలు జరుగుతుందని ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఆన్‌లైన్‌లో కార్మికుల వివరాలు పొందుపరిచేందుకు అధికారులు రంగంలోకి దిగారు. గతంలో మాస్టర్ వీవర్స్, దళారులు తమకున్న పరిచయాలు ఇతర ఒప్పందాలతో, తామే అనుబంధ కార్మికులుగా ఉంటూ బిల్లులు మంజూరు చేసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. కాగా వాటికి చెక్ పెట్టి, నిజమైన చేనేత కార్మికులకు పథకాల ప్రయోజనం చేకూర్చేందుకు చేనేత కుటంబ సభ్యుల సర్వే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో క్షేత్ర స్థాయిలో వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు.

పకడ్బందీగా ఓటర్ జాబితా సవరణ



మాట్లాడుతున్న ఆర్డీఓ రాములు

అలంపూర్: ఓటర్ జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి రాములు అన్నారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జాబితాలోని ఓటర్ల సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు తప్పులు, పొరబాట్లు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేసుకోవడం, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఓటర్ సప్లిమెంటరీ జాబితాను సిద్ధం చేసి జనవరిలో ప్రచురితం చేయడం జరుగుతుందన్నారు. ఓటర్ జాబితాలో మృతి చెందిన వారి వివరాలు, వివాహాలు చేసుకొని వెళ్లిపోయిన, శాశ్వతంగా గ్రామం వదిలి వెళ్లిన వారి వివరాలు సేకరించాలని బీఎల్‌ఓలకు సూచించారు. మరణించిన వారి కుటుంబ సభ్యుల నుంచి మరణ ధ్రువీకరణ పత్రం, వివాహమై గ్రామం విడిచి వెళ్లిన కుటుంబ సభ్యుల నుంచి వాంగ్మూలం తీసుకోవాలన్నారు. గ్రామ పెద్ద నుంచి సమాచారాన్ని రూఢీ చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు బూత్ లెవల్ ఏజెంట్లకు సమాచారం ఇచ్చి బీఎల్‌ఓలకు సహకరించాలని, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియకు తోడ్పాటును అందించాలన్నారు. సమావేశాలు నిరంతరం కొనసాగుతాయని ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం రాజకీయ పార్టీల నాయకులు తమ అభిప్రాయాలను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్ నాయడు, నాయకులు వెంకట్రామయ్యశెట్టి, నాగ మద్దిలేటి, ముజీబ్, పెద్దబాబు, నరసింహులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాలను కొత్త మండలంలో చేర్చాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అలంపూర్/ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వల్లూరు, బట్లదిన్నె గ్రామాలను నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎర్రవల్లి మండలంలో చేర్చాలని ప్రజాప్రతినిధులు.. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. శనివారం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు హైదరాబాద్‌లోని చల్లా కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో జడ్పీటీసీ సభ్యుడు హనుమంత్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రాందేవ్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, తిక్కారెడ్డి, మహేష్, బీముడు, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

రెగ్యులర్ చేసే వరకు సమ్మె



గద్వాలలో కళ్లకు గంతలతో నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

గద్వాల అర్బన్: తమను రెగ్యులర్ చేసే వరకు సమ్మెను కొనసాగిస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అన్నారు. న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలని జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో చేపట్టిన సమ్మె శనివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా జూనియర్ పంచాయితీ కార్యదర్శులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తున్నా.. తమ ఉద్యోగాలు మాత్రం క్రమబద్ధీకరించడం లేదన్నారు. ప్రొబేషనరీ కాలం పూర్తయినప్పటికి ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. వెంటనే ఓపీఎస్‌లను జేపీఎస్‌లు రెగ్యూలర్ చేయాలని, జేపీఎస్‌ల ప్రొబేషనరీ కాలాన్నీ సర్వీస్‌గా కాలంగా పరిగణించి రెగ్యులర్ చేయాలని, విధి నిర్వహణలో మృతి చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మెలో జేపీఎస్‌లు పాండు, ప్రవీణ్, రియాజ్, పరమేష్, శశికళ, రజిత, భారతి, రుకియాబీ, అశ్విని, కవిత, నిరంజన్ తదితరులు ఉన్నారు. ఇదిలాఉండగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి జేపీఎస్‌లు చేపడుతున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల శ్రమను దోచుకుంటుందని, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయండి



పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: నియోజకవర్గంలో చేపడుతున్న రోడ్ల పనులు వేగవంతం చేయాలని పంచాయతీ రాజ్ అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం ఆదేశించారు. శనివారం అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. పనులు వేగవంతంగా నాణ్యతగా జరిగేలా చూడాలని, గ్రామాల్లో ప్రజా ప్రతినిధులతో సమావేశమై అవసరమైన రోడ్లకు ప్రతిపాదనలు చేయాలన్నారు. సమావేశంలో ఈఈ ఆంజనేయులు, డీఈ ఎంఏ సలీం, ఏఈలు శ్రీనివాసులు, నరేంద్ర, లక్ష్మణ్, పాండురంగయ్య, లక్ష్మీనారయణ రెడ్డి తదితరులు ఉన్నారు. ఇదిలాఉండగా, అలంపూర్ మండలం కాశీపురానికి చెందిన జయరాముడుకి మెరుగైన వైద్యం నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ. 2.50 లక్షలు మంజూరు కాగా.. ఎల్‌ఓసీ అందజేశారు. లక్ష్మణ్, నాగేశ్వర్ రెడ్డి, నర్సన్ గౌడ్, వెంకట్రాములు, దామోదర్ రెడ్డి, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు పాలమూరులో నిరుద్యోగ నిరసన ర్యాలీ

- హాజరుకానున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా నాయకులు
- మెట్టుగడ్డ నుంచి క్లాక్‌టవర్ వరకు పాదయాత్ర

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్‌నగర్‌లో నిరుద్యోగ నిరసన ర్యాలీ చేపట్టనున్నారు. ఈ మేరకు నాలుగు రోజుల నుంచి నాయకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు మెట్టుగడ్డ నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఆర్టీసీ బస్టాండ్, అశోక్ టాకీస్ చౌరస్తా మీదుగా క్లాక్‌టవర్ వరకు పాదయాత్రగా ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం క్లాక్‌టవర్‌లో రాత్రి కార్నర్ మీటింగ్ (బహిరంగసభ) ఏర్పాటు చేశారు. మెట్టుగడ్డ నుంచి ప్రారంభమయ్యే పాదయాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొననున్నారు. అనంతరం నిరసన సభలో నాయకులు ప్రసంగించనున్నారు. పార్టీ శ్రేణులు, యువత, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొనాలని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడం వల్ల నిరుద్యోగ నిరసన సభ విజయవంతం కోసం ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి దాదాపు 20 వేల మంది పాల్గొనేలా పార్టీశ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పథకాలపై అవగాహన కల్పించండి




మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: జిల్లాలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ప్రతి శాఖ నుంచి 100 మంది చొప్పున సమీకరించి ఆయా శాఖల పరిధిలో ఉన్న పథకాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శనివారం తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులకు శాఖల వారీగా ఉన్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని, కార్మికులకు భవన నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమాన్ని సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో కార్మిక శాఖ జిల్లా అధికారి మహేష్, ఆర్టీఏ పురుషోత్తంరెడ్డి, డీఎస్‌వో రేవతి, డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులకు శిక్ష పడేలా చూడాలి : ఎస్పీ

గద్వాల క్రైం: పలు కేసుల్లో నేరస్తులుగా ఉన్న వారికి శిక్ష పడేలా చూడాలని ఎస్పీ సృజన సూచించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని కోర్టులో పీపీలుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. లైంగికదాడి, పలు కేసుల్లో ఎక్కువ శాతం శిక్షలు పడకపోవడానికి గల కారణాలపై సమీక్షించారు. చార్జ్‌షీట్ దాఖలు చేసిన క్రమంలో అభ్యంతరాలు, కోర్టుకు సమగ్ర నివేదికలు ఇవ్వడంలో విచారణ అధికారుల వైఫల్యం ఉంటే అప్పటికప్పుడు గుర్తించాలన్నారు. సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. పీపీలు వెంకట్రాములు, ఆనంద్ కుమార్, రెచల్ సంజన జాషువా, భవాని, కార్తీక్ పాల్గొన్నారు.









క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

గట్టు: మండలంలోని ఇందువాసిలో ఓ రైతు పొలం వద్ద అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు లక్ష్మన్న (45) శుక్రవారం సాయంత్రం ఇంటి దగ్గరే భోజనం చేసి రోజు మాదిరిగా పొలానికి వెళ్లి అక్కడే పడుకున్నాడు. మరుసటి రోజు ఉదయం ఇంటికి రాకపోవడం, ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో పక్క పొలాలకు చెందిన రైతులు గుడిసె దగ్గరకు వెళ్లి చూడగా చనిపోయి కనిపించాడు. ఈ విషయాన్ని వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇవ్వగా గద్వాల సీఐ చంద్రశేఖర్, గట్టు ఎస్ఐ పవన్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మొదట్లో లక్ష్మన్నను ఎవరో హత్య చేసినట్లుగా గ్రామంలో వదంతులు వినిపించాయి. అనంతరం పిడుగుపాటుకు గురై మృతిచెంది ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. లక్ష్మన్న భార్య హనుమంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

కున్సిలో యువకుడు..

కృష్ణా: మండలంలోని కున్సిలో శనివారం కిష్టప్ప(28) అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. కిష్టప్ప కొంతకాలంగా కర్ణాటకలోని బెంగుళూర్‌లో కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. వారం క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన పుండ మారెప్పతో కలిసి మద్యం తాగి తరువాత వీరు గొడవపడ్డారు. శనివారం తెల్లవారుజామున లేచి చూసేసరికి ఇంటి ఎదుట మృతిచెంది కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

దున్నపోతు దాడిలో వృద్ధుడికి గాయాలు

అయిజ: దేవర దున్నపోతు దాడిలో ఓ వృద్ధుడు తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని తొత్తినోనిదొడ్డికి చెందిన బలరామయ్యశెట్టి మోటార్‌సైకిల్‌పై మండల కేంద్రానికి వస్తుండగా మండలంలోని భూంపురం గ్రామం వద్ద దేవర దున్నపోతు కొమ్ములతో పొడిచి కొంతదూరం లాక్కెళ్లింది. గ్రామస్తులు వెంటనే స్పందించి బెదిరించడంతో వదిలి వెళ్లింది. అప్పటికే గాయాలపాలైన వృద్ధుడిని అయిజలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి.. అటునుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. దేవర చేసేందుకు మేడికొండ గ్రామస్తులు పెంచిన దున్నపోతు ఇప్పటికే అనేకమందిపై దాడి చేసిందని.. దాన్ని విక్రయించాలని మండలంలోని ప్రజలు సర్పంచ్ తిప్పారెడ్డికి సూచించారు.

ఇసుక డంపులు సీజ్

మానవపాడు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న, ఇప్పటికే చేసిన ఇసుక డంపులను సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా హెచ్చరించారు. శనివారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో 10 నుంచి 12 ట్రాక్టర్ల ఇసుక డంపులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే జరిమానా కూడా విధిస్తామని తెలిపారు. ఆర్ఐ రజానీకాంత్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



నేడు కానిస్టేబుల్ 'తుది' పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన పోలీస్‌శాఖ, జేఎన్‌టీయూ అధికారులు
- ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి గంట వరకు పరీక్ష
- ఉమ్మడి జిల్లా నుంచి 14,388 మంది అభ్యర్థులు హాజరు
- మహబూబ్‌నగర్‌లో 30, భూత్పూర్‌లో ఒక సెంటర్ ఏర్పాటు



మహబూబ్‌నగర్ క్రైం: కానిస్టేబుల్ తుది రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి గంటల వరకు పరీక్ష కొనసాగనుంది. మహబూబ్‌నగర్‌లో 30 పరీక్ష కేంద్రాలతో పాటు భూత్పూర్‌లో ఒక పరీక్ష కేంద్రంలో పరీక్ష నిర్వహించడానికి పోలీస్ శాఖతో పాటు జేఎన్‌టీయూ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. పరీక్షకు ఉమ్మడి జిల్లాకు సంబంధించి 14,388 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉన్న అభ్యర్థులకు పరీక్షకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు 254 మంది పోలీస్ సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశారు. ఒక అదనపు ఎస్పీ, డీఎస్పీ 3, సీఐలు 10, ఎస్ఐలు 50, హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ కలిపి 254 మందితో పోలీసులు ఉంటారు. పరీక్ష కేంద్రాల దగ్గర ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా మూడు అంచెల భద్రత ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం దగ్గర ఎస్ఐ స్థాయి అధికారితో పాటు ఒక హెడ్ కానిస్టేబుల్స్, ముగ్గురు కానిస్టేబుల్స్‌తో పాటు ఒక మహిళ కానిస్టేబుల్ ఉంటుంది. పరీక్ష రాయడానికి వస్తున్న అభ్యర్థులు రెండు గంటల ముందు కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్షకు ఒక గంట ముందు అభ్యర్థులను హాలులోకి అనుమతి ఇస్తారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, గుర్తింపు కార్డు(ఆధార్, ఓటర్ ఐడీ, లైసెన్స్) తీసుకురావాలి. ఉదయం 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యం అయిన అభ్యర్థులను లోపలికి అనుమతి ఇవ్వరు. పరీక్ష కేంద్రం సమీపంలో ఉన్న జిరాక్స్, ఇంటర్‌నెట్ దుకాణాలు మూసివేయడంతో పాటు, పరీక్ష కేంద్రం దగ్గర 144సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రంలోకి ఇన్విజిలేటర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, ఇతర సిబ్బందితో పాటు ఎవరికీ సెల్‌ఫోన్ అనుమతి లేదు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

40 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

కానిస్టేబుల్ తుది రాత పరీక్ష సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థుల కోసం మహబూబ్‌నగర్ ఆర్టీసీ అధికారులు 40 ప్రత్యేక బస్సులు కేటాయించారు. గద్వాల 10, నాగర్‌కర్నూల్ 10, వనపర్తి 10, నారాయణపేట 10 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో అభ్యర్థులు ఎక్కువగా ఉంటే మరో 10 బస్సులు పెంచుతామని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

జిల్లా	సివిల్ పోస్టులు	ఏఆర్ పోస్టులు
మహబూబ్‌నగర్	140	61
నాగర్‌కర్నూల్	142	53
నారాయణపేట	63	37
వనపర్తి	95	36
జోగుళాంబ గద్వాల	83	35

అభ్యర్థులకు ఏకాగ్రత ముఖ్యం

కానిస్టేబుల్ పరీక్ష 200 మార్కులకు సంబంధించి 3 గంటల సమయం ఉంటుంది. అభ్యర్థులు చాలా ఏకాగ్రతతో సమాధానాలు ఆలోచించి పరీక్ష పూర్తి చేయాలి. అభ్యర్థులు ఒరిజినల్ ఐడీ కార్డు, బాల్ పెన్ను, హాల్‌టికెట్ తప్ప ఏది వెంట తీసుకురావొద్దు. పెన్సిల్, వైట్‌నర్, వాచ్ ఇలా దేనికి అనుమతి లేదు. గంట ముందు పరీక్షకేంద్రంలోకి అభ్యర్థులకు అనుమతి కల్పించి, ట్యాబ్ ద్వారా అభ్యర్థి ఫింగర్ ప్రింట్ తీసుకోవడంతో పాటు ఫొటో తీసి స్కాన్ చేస్తాం.

– డాక్టర్ సుజీవన్‌కుమార్, పరీక్ష రీజినల్ కో–ఆర్డినేటర్

నిబంధనలు పాటించాలి..

31 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. వీటిని ఐదు రూట్‌లుగా విభజించాం. కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బందితో మూడు అంచెల భద్రత ఏర్పాటు చేశాం. పరీక్షకు వచ్చే అభ్యర్థులు తప్పక నిబంధనలు పాటించాలి. సెల్‌ఫోన్లు, వాచ్‌లు, ఇతర ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోనికి అనుమతించం.

– రాములు, అదనపు ఎస్పీ, కానిస్టేబుల్ పరీక్ష నోడల్ ఆఫీసర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవాబుపేట: మండలంలోని కాకర్లపహాడ్‌కు చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ పురుషోత్తం కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డమీది వెంకట్రాములు(27) తన భార్య స్వాతితో గొడవపడి ఈ నెల 24న గ్రామ సమీపంలోని నర్సరీ వద్ద పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అటు వైపు వెళ్లిన వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న వెంకట్రాములు శనివారం పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ ఘటనపై వెంకట్రాములు సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మక్తల్: చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని మంతన్‌గోడ్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ పర్వతాలు కథనం మేరకు.. కడప జిల్లా కందిమల్లయ్యపల్లికి చెందిన బాపట్ల అంకయ్య ప్రేమ వ్యవహారం వద్దని తన కుమారుడు పెద్దరాయుడు (21)ని మందలించి మంతన్‌గోడ్‌లో ఉన్న బంధువుల ఇంటికి మూడురోజుల క్రితం పంపించాడు. అయితే శుక్రవారం ఉదయం గ్రామంలోని ఓ వ్యవసాయ పొలం వద్ద పసురు తాగి చనిపోతున్నానంటూ తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. సమీప పొలాల రైతులు పెద్దరాయుడు నోట్లో నుంచి నురుగు రావడం గుర్తించి వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి.. మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. తండ్రి అంకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

అనుమానాస్పద మృతిపై ఫిర్యాదు


సత్యనారాయణ (ఫైల్)

అడ్డాకుల: భర్త అనుమానాస్పద మృతిపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. అడ్డాకుల ఎస్ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన బోగం సత్యనారాయణ, మమత భార్యాభర్తలు. కాన్పు కోసం మమత ఇటీవల దేవరకద్ర మండలంలోని జీనగరాల గ్రామానికి వెళ్లింది. శుక్రవారం సత్యనారాయణ ఊర్లోకి వెళ్లి కల్లుతాగి ఇంటికి వచ్చాడు. అదేరోజు సాయంత్రం ఆకస్మికంగా ఇంట్లోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుని భార్య పొన్నకల్‌కు వచ్చింది. భర్త మృతిపై అనుమానం ఉందని శనివారం అడ్డాకుల ఠాణాలో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారణ చేసి సత్యనారాయణ మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

వాహనాల దొంగ అరెస్ట్

కల్వకుర్తి రూరల్: వాహనాల చోరీలకు పాల్పడిన ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమేష్‌యాదవ్ తెలిపారు. మండలంలోని సుద్దకల్ గ్రామానికి చెందిన కడారి రవికి చెందిన ద్విచక్ర వాహనం, తుర్కలపల్లి గేట్ వద్ద హైదరాబాద్‌కు చెందిన గడ్డం అనిల్ ద్విచక్రవాహనాన్ని పట్టణంలోని జింజర్ హోటల్ వద్ద చోరీ చేసినట్లు చెప్పారు. ఈ మేరకు నిందితుడు కొణిదెల సుధాకర్ పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారని తెలిపారు. సుధాకర్‌కు గతంలోనూ నేర చరిత్ర ఉందన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుళ్లు చిరంజీవి, నజీర్‌లను ఎస్ఐ అభినందించారు.

స్విమ్మింగ్‌పూల్‌లో పడి బాలుడి మృతి

వనపర్తి: ఈత కోసం స్నేహితులతో కలిసి ఈత కోసం వెళ్లిన ఓ బాలుడు స్విమ్మింగ్‌పూల్‌లో పడి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీచౌక్ ప్రాంతానికి చెందిన సల్మాన్ (14) అనే బాలుడు మిత్రులతో కలిసి ఈత కోసం చింతల హనుమాన్ ఆలయం సమీపంలోని కమలానగర్ కాలనీలో గల స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లాడు. ఈత రాకపోయినా.. స్విమ్మింగ్‌పూల్‌లో దూకాడు. నీటిలో కొట్టుకుంటుండటంతో స్థానికులు బాలుడిని బయటికి తీశారు. స్థానిక జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం కోసం బాలుడి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ విషయమై పట్టణ ఎస్ఐ యుగంధర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

కిష్టగిరి శివాలయంలో చోరీ

వనపర్తి: మండలంలోని కిష్టగిరి గ్రామ శివాలయంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ అర్చకుల కథనం ప్రకారం.. అమ్మవారి మెడలోని రెండు పుస్తెలు, నాలుగు వన్‌గ్రామ్ గోల్డ్ నక్లెస్‌లు, ఆరు వెండి విగ్రహాలు, ఐదు చిన్నవి రెండు ఇంచుల పంచలోహ విగ్రహాలను అపహరించుకుపోయారు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఆలయానికి వెళ్లగా చోరీ విషయం బయట పడింది. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.50 వేలకు పైగా ఉంటుందని గ్రామస్తులు చెప్పారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రిషి ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

పాలమూరు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రిషి కళాశాల విద్యార్థి ఎస్.బాలవర్ధన్ ఆలిండియా 40వ ర్యాంకు సాధించినట్లు కళాశాల సలహాదారుడు వెంకటయ్య, కరస్పాండెంట్ చంద్రకళ వెంకట్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని రిషి కళాశాలలో శనివారం ర్యాంకు సాధించిన విద్యార్థులను అభినందించారు. అలాగే జె.శ్రీనివాస్ 3,314, కె.కౌశిక్‌యాదవ్ 3,843, ఎస్.వరప్రసాద్‌రెడ్డి 2,517, జి.మహేష్ 5,922, రాఘవప్రియ 6,630, జి.దినేష్ 6,846, ఎస్.కృష్ణకౌసిక్ 6,915, వి.భవిత 14,653, ఎం.అభినవ్ 9,264 ర్యాంకులు సాధించారన్నారు. రిషి విద్యా సంస్థలు విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించేలా కృషిచేస్తున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయి జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో రిషి కళాశాల డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'వాగ్దేవి' విద్యార్థికి 127వ ర్యాంకు


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లాకేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి శివప్రసాద్ 127వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. మరో 11 మంది విద్యార్థులు శివప్రసాద్, సింధురెడ్డి, అఖిల, అశ్విని, మధుర, దీపక్, కౌశిక, నిఖిల్, సాత్విక్, అనిరుధ్, క్షితిజ్‌పాల్ ఉత్తమ పర్సంటైల్ సాధించి జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ఐఐటీ– నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ పావని, యాజమాన్య సభ్యులు కోట్ల శివకుమార్, నాగేందర్, ఎంసెట్ ఇన్‌చార్జ్ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిభ'కు ఉత్తమ ర్యాంకులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రతిభ జూనియర్ కళాశాల డైరెక్టర్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లాకేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. కె.పవన్‌కుమార్, 99.10 పర్సంటైల్, ఎండీ ఇబ్రహీం 1,677 ర్యాంకు, కె.సూర్యతేజ 578, వి.కార్తిక్ 2,399, ఎం.శివతేజ 2,737 ర్యాంకులు సాధించారు. అలాగే ఎం.శివతేజ, పి.తనుశ్రీ, యు.నిఖిలేష్‌కుమార్, సాయిసాకేత్‌రెడ్డి, కె.పూజిత, యశ్వంత్‌చారి, అజర్ హుసేన్, సుప్రిత, జి.సాత్విక్‌రెడ్డి, యు.శృతి, వరుణ్‌కుమార్‌రెడ్డి, ఇ.స్పందన, సి.రిషిత, షాహెద్‌అజీం, ఎస్.బాబారెడ్డి, సాయిచరణ్, అనిరుధ్‌గౌడ్, ఈశ్వర్, ఎం.నందిని ఉత్తమ ర్యాంకులు సాధించారు. విద్యార్థులను డైరెక్టర్లు మంజులాదేవి, లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ కృష్ణయ్య, వెంకటరామయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

WANTED TEACHERS
BRILLIANT GRAMMAR HIGH SCHOOL
Subhash Nagar, Kalwakurthy, Nagarkurnool (Dist)
Wanted Teachers: For Pre-Primary Primary, Middle and High School
Subjects: For all Subjects
Interview Date: 1st, 2nd, 3rd may 2023
Timings: 9:30 am to 4:00 pm.
Contacts:
7396476622, 9705344209, 9010529980



రిజర్వాయర్ పనుల అడ్డగింత

- పురుగుమందు డబ్బాలతో నిర్వాసితుల నిరసన
- పునరావాస కేంద్రంలో ఇళ్లు కట్టలేమని చిన్నోనిపల్లి గ్రామస్తుల ఆవేదన
- వట్టెం తరహా ప్రత్యేక జీఓ ఇవ్వాలని డిమాండ్
- త్వరలో గద్వాల పర్యటనకు వస్తున్న సీఎంను కలిసేందుకు ప్రయత్నాలు


చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులను అడ్డుకున్న నిర్వాసితులు

గట్టు: చిన్నోనిపల్లి నిర్వాసితులు శనివారం మూకుమ్మడిగా రిజర్వాయర్ కట్ట దగ్గరకు తరలివెళ్లి రిజర్వాయర్ పనులను అడ్డుకున్నారు. కుటుంబాల్లోని పిల్లలు, పెద్దలు, మహిళలు అందరూ కలిసి పురుగుమందు డబ్బాలను చేతపట్టుకుని అడ్డుకున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా 101 ప్యాకేజీలో భాగంగా చిన్నోనిపల్లి దగ్గర రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నారు. సుమారుగా 17 ఏళ్ల తర్వాత అసంపూర్తిగా ఉన్న రిజర్వాయర్‌ను పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నిస్తోందని, నిర్వాసితులకు న్యాయం చేయకుండానే రిజర్వాయర్ గండిని పూడ్చడం ద్వారా వర్షాలకు గ్రామంలోకి నీరు వచ్చే అవకాశం ఉన్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో పోలీస్ బలగాల మధ్య రిజర్వాయర్ కట్ట గండిని పూడ్చే పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పట్లో పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని, తర్వాత వదిలేశారు. ఏడాది కాలంగా నిర్వాసిత కుటుంబాలు రిజర్వాయర్‌ను రద్దు చేయాలని ఆందోళన చేస్తూ వచ్చారు. ఇవేమీ పట్టించుకోకుండా పోలీస్ బలగాలతో రిజర్వాయర్ కట్ట అసంపూర్తి పనులను పోలీస్ పహారా మధ్య ప్రారంభించారు. నెల రోజుల తర్వాత నిర్వాసిత కుటుంబాలు మళ్లీ రిజర్వాయర్ పనులను అడ్డుకున్నారు.

సౌకర్యాలు లేకుండానే...

చిన్నోనిపల్లి నిర్వాసితుల కోసం ప్రభుత్వం ఏర్పాటు పునరావాస కేంద్రంలో ఎలాంటి సౌకర్యాలు లేవని, మౌలిక వసతులు కల్పించకుండానే పునరావాస కేంద్రంలోకి వెళ్లాలంటే ఎలా అని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. ముంపునకు గురైన గ్రామంలో 250 గృహాలగాను 360 మందికి పట్టాలిచ్చారని, ప్రస్తుతం మరో 4000 మంది రోడ్డున పడే పరిస్థితి ఉన్నట్లు వాపోయారు. 17 ఏళ్ల క్రితం నాటి లెక్కల ప్రకారం ముంపు ఇళ్లకు ఇచ్చే పరిహారంతో ప్రస్తుతం పెరిగిన రేట్లకు సరిపోదని, ఇళ్లు ఎలా కట్టుకోవాలని ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణానికి ప్లాట్లు సక్రమంగా లేవని, గుంతలను పూడ్చుకునేందుకు రూ.వేలు ఖర్చు చేసే పరిస్థితి ఉందని వాపోయారు. వట్టెం తరహాలోనే చిన్నోనిపల్లి నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పునరావాస కేంద్రంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించిన తర్వాతే పనులు చేపట్టాలని డీఈఈ ఉపేంద్రను కోరారు. పనులు జరిగే చోట ఆయనను కలిసి విజ్ఞప్తి చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఆయన హామీ ఇచ్చినట్లు నిర్వాసిత రైతులు తెలిపారు.


పనులు జరిగే చోట పురుగుల మందు డబ్బాలతో నిర్వాసితుల నిరసన

సీఎంను కలిసే అవకాశం కల్పించండి

సీఎం కేసీఆర్ గద్వాల పర్యటనకు వస్తున్న క్రమంలో నిర్వాసితుల కుటుంబాల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లడానికి అవకాశం కల్పించాలని చిన్నోనిపల్లి నిర్వాసితులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, చిన్నోనిపల్లి సర్పంచ్ ఉమాదేవికి నిర్వాసిత కుటుంబీకులు విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్‌ను కలిసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
Caliber Education Online English Communication Skills classes for all age groups. For details Contact 9390006358.

HOUSE FOR SALE
PLOT FOR SALE
FLAT FOR SALE
LAND FOR SALE
SERVICES
BRICKS
Lease/Sale CRR బ్రిక్స్ Cell: 9885309804.
HEALTH CARE
GYNECOLOGY

ORTHOPEDIC SURGEON

WANTED
Need M/F Who Are Good At ENG Speaking as PRI & HS Spoken ENG Trainers, Experience, not a must. FreeTraining by CFEL. Sal 20 - 30K. Ph: 8919641609

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనలు కొరకు
నాలుగు లైన్లకు రూ.: 200/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50
5% GST అదనం మాత్రమే
మహబూబ్‌నగర్ : 9010234478
9010522215
9705135557
9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

సాక్షి ద్వారా మీ ఆత్మీయ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయండి
కేవలం రూ. 500/-

గమనిక